

కాంగ్రెస్ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెలే పట్నం నరేందర్‌రెడ్డి

సీఎం ఇలాకాలో కాంగ్రెస్‌కు షాక్

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

కొడంగల్, ఫిబ్రవరి 12 : సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో కాంగ్రెస్ పార్టీకి గడ్డుపరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇటీవల కాలంలో చాలామంది కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. బుధవారం కూడా రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోని కొడంగల్ మండలం చిన్న నందిగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 30 మంది బొంరాస్‌పేట మండల కేంద్రంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ అభివృద్ధి పూర్తిగా వెనుకబడి పోయిందని విమర్శించారు. రైతులు, ప్రజలు ఎటువంటి సంక్షేమ ఫలాలు అందుకోలేక నానా ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే తెలంగాణను కాపాడుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

కాంగ్రెస్‌లో గుర్తింపు లేదు..

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎంతోకష్టపడి పనిచేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే తమకు పార్టీలో ఎటువంటి గుర్తింపు లేదని ఆరోపించారు.

లోకం పోకడ



పథకాల్లో కోతలు.. జీతాల్లో వాతలు

సర్కారుపై మండిపడ్డ హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలంటూ గొప్పలు చెప్పుకొంటున్న రాష్ట్ర ప్రభుత్వం 12 రోజులు గడుస్తున్నా హోంగార్డులకు జీతాలు చెల్లించకపోవడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. 16 వేల మంది హోంగార్డులకు 12 రోజులు గడుస్తున్నా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని 'ఎక్స్'లో ఫైర్ అయ్యారు. 'తక్కువ జీతాలపై ఆధారపడి జీవిస్తున్న హోంగార్డులు.. చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి. ఈఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న దుస్థితి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెల ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి వీరికి ఏం సమాధానం చెబుతారు?' అంటూ నిలదీశారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.. ఇది ప్రజాపాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన అంటూ మండిపడ్డారు. హోంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గోయల్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : జనాభా నియంత్రణ చేస్తూ, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు మరింత వృద్ధి చెందేలా చేయూతనివ్వాలని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తుంటే 'చోటీ సోచ్' అంటూ కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ అవమానించడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి చోటీ సోచ్‌కు ఇది నిదర్శనమని చురకలంటించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్రం వసూలు చేసే పన్నుల్లో 41 శాతం 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రాలకు ఇవ్వాలని, సెస్సులు, సర్‌చార్జీలు విధించడం వల్ల రాష్ట్రాలకు వచ్చే పన్నుల వాటా చాలా తగ్గిపోతున్నదని, వెరసి 41 శాతంలో రాష్ట్రాలకు వాస్తవంగా అందుతున్నది 30 శాతం మాత్రమేనని వివరించారు. తమకు అనుకూలంగా లేని రాష్ట్రాలకు కేంద్రం మొండి చెయ్యి చూపటం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఆర్థిక అధికారాలు తమ వద్ద పెట్టుకొని రాష్ట్రాలపై పెత్తనం చేయాలని చూస్తున్నదని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం కాదా? ఇదేనా టీమ్ ఇండియా స్ఫూర్తి? అని నిలదీశారు. రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడుతుంటే అవమానకరంగా మాట్లాడటం తగదని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్‌కు సూచించారు.

బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మహిళా శంఖారావం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మార్చి 8న మహిళా శంఖారావం

హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహణ

బూటకపు హామీలతో మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబావుటా

రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి

రేవంత్ పాలనలో క్రైమ్ రేటు 20% వృద్ధి

శంఖారావం పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న మహిళా శంఖారావం సభ నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బూటకపు హామీలతో మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహిళా శంఖారావం సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో కలిసి బుధవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మహిళా శంఖారావం వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 100 రోజుల్లో హామీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు 14 నెలలైనా పట్టించుకోవడంలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడం లేదని, ఒక్కో మహిళకు రూ.35 వేల చొప్పున రేవంత్‌రెడ్డి బాకీ పడ్డారని విమర్శించారు. రూ.35 వేలను ప్రతి మహిళకు వారి బ్యాంకు ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు భద్రత లేదని, రేవంత్‌రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20% పెరిగిందని విమర్శించారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు భయం భయంగా ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, నగర శివారు ప్రాంతాల్లో దొంగలు చెలరేగుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సీసీటీవీల్లో 70% పనిచేయడం లేదని విమర్శించారు.

భద్రత కోసం పోరాటాలు

భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సి రావడం బాధాకరమని కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తంచేశారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇస్తామని రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్‌పై అక్కసుతో కేసీఆర్ కిట్‌లను నిలిపివేసి మానవత్వం లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ దవాఖానలకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ దవాఖానలపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని బిల్డప్ ఇచ్చిన సర్కార్ మరోవైపు బస్సుల సంఖ్యను తగ్గించిందని విమర్శించారు. రైతుల డిక్లరేషన్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారనే రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకొన్నారని కవిత విమర్శించారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోరనే రాహుల్ భయపడినట్టు ఉన్నారని ఎద్దువా చేశారు.

గురుకులాలను భ్రష్టుపట్టించారు..

తమ అసమర్థతతో గురుకులాలను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథక నిర్వహణను కూడా గాలికొదిలేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఘాటుగా స్పందించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు లేక భోజనం కోసం విద్యార్థులు ఎండలో కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తక్షణమే మధ్యాహ్న భోజన నిర్వాహకులను నియమించి విద్యార్థులకు పాఠశాల ఆవరణలోనే భోజనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒకేగూటి పక్షులు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ మొదటి నుంచీ చెప్తున్నట్టు కేంద్రంలోని అధికార బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఒకే గూటి పక్షులని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నువ్వు కొట్టినట్టు చేస్తే, నేను ఏడ్చినట్టు చేస్తా.. అన్నట్టుగా ఆ రెండు జాతీయ పార్టీల తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. ఇరు పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం ఇప్పటికే పలుమార్లు బయటపడిందని గుర్తుచేశారు. తెలంగాణలో రైతులు, ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, హైడ్రా పేరుతో నిరుపేదల ఇండ్లను సర్కారు నేలమట్టం చేస్తున్నా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి రక్తంలోనే బీజేపీ డీఎన్ఏ ఉన్నదని పేర్కొన్నారు. ప్రధాని మోదీని తన పెద్దన్నగా రేవంత్‌రెడ్డి సంబోధించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు బీజేపీకి మళ్లిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయని విమర్శించారు. తెలంగాణ కోసం నిఖార్సుగా పోరా డే పార్టీ బీఆర్ఎస్ అని, తెలంగాణ ఆత్మగౌరవం, హక్కులు కాపాడటం తమ పార్టీ ఎజెండా అని తెలిపారు. కానీ బీజేపీ, కాంగ్రెస్‌లకు 100 ఎజెండాలు ఉంటాయని విమర్శించారు.

రేవంత్ పాలనలో గాడితప్పిన విద్యావ్యవస్థ

గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి లేని తొలి క్యాబినెట్ ఇదేనని మండిపడ్డారు. విద్యావ్యవస్థపై ఎమ్మెల్సీ కోదండరాం ఎందుకు మౌనంగా ఉంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీల దోపిడీ ఎక్కువైందని, హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న పలు కాలేజీలకు అనుమతులు లేవని ఆరోపించారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ కేసు మార్చి 20కి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): గవర్నర్‌కోటా ఎమ్మెల్సీ ఎన్నిక కేసు తదుపరి విచారణను మార్చి 20కి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్‌ను, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణను ఎమ్మెల్సీగా నాటి కేసీఆర్ మంత్రి వర్గం ఆమోదించింది. అయితే, వీరి నియామకాన్ని అప్పటి గవర్నర్ తమిళిసై ఆమోదించలేదు. కేసీఆర్ మంత్రిమండలి రెండుసార్లు ఆమోదించి పంపినా గవర్నర్ వాటిని ఆమోదించకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు బుధవారం విచారణ చేసింది. వాదనలు విన్న అనంతరం కేసు తదుపరి విచారణను మార్చి 20కి వాయిదా వేసింది.

ఓటమి భయంతోనే వెనుకంజ

మొదటిపేజీ తరువాయి...

తలెత్తుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, మార్చి, ఏప్రిల్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉంటుందని సంబంధిత మంత్రి సమావేశం దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే దాదాపు 2000కు పైగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి పరిస్థితులు ఉన్నాయని, ఏప్రిల్ నాటికి దాదాపు 5000 నుంచి 7000 గ్రామాల్లో ఉంటుందని సమాచారం

సానుకూల పరిస్థితుల్లేవ్

ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్లేందుకు గ్రామాల్లో సానుకూల పరిస్థితుల్లేవని, కనీసం స్థానిక ఎమ్మెల్యేలు కూడా గ్రామాల్లో తిరిగి రాజకీయాలు చేసే పరిస్థితి లేదని సీనియర్ మంత్రి ఒకరు వాపోయినట్టు సమాచారం. అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచలేకపోయాయని ఓ మంత్రి అభిప్రాయపడ్డట్టు తెలిసింది. కులగణన, రైతుభరోసాపై తీవ్ర వ్యతిరేక ప్రచారం జరిగిందని, ఉన్న సమస్యలకు తాగునీటి సమస్య కూడా తోడైతే ప్రజలు నాయకులను ఊర్లళ్లకు కూడా రానివ్వరని, ఈ సమయంలో ఎన్నికలు పెట్టి ఓట్ల డగడం అతిపెద్ద సాహసమే అవుతుందన్న ఆలోచనకు వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వానలు పడే వరకు స్థానిక సంస్థల ఎన్నికల జోలికి వెళ్లకపోవడమే ఉత్తమమనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించి, తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ కార్యం పూర్తయ్యే నాటికి కనీసం నాలుగు నుంచి ఆరు నెలల సమయం పడుతుందని, ఈ ఆరు నెలలు ప్రతిపక్షాల నోరు మూసినట్టు కూడా ఉంటుందని అంచనా వేసినట్టు సమాచారం.

కేసీఆర్‌తో 3,4 రోజుల్లో గ్రేటర్ కార్పొరేటర్ల భేటీ

- పరిస్థితులకు అనుగుణంగా మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై నిర్ణయం
- రాష్ట్రంలో బీసీ ఉద్యమం బలంగా ఉంది
- చట్టపరంగా 42% రిజర్వేషన్ ఇవ్వాలి
- జనాభా తక్కువ చూపితే నిధులు తగ్గుతయ్
- మీడియా చిట్‌చాట్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మూడు, నాలుగు రోజుల్లో జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల సమావేశం నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. వచ్చేవారంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోనూ భేటీ ఉంటుందని తెలిపారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియా చిట్‌చిట్‌లో మాట్లాడారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీపై 17న నిర్ణయం తీసుకుంటామన్నారు. పరిస్థితులకు అనుగుణంగా నంబర్ గేమ్‌ను బట్టి మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై నిర్ణయం ఉంటుందని వివరించారు. మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై కేటీఆర్ ఆధ్వర్యంలో వచ్చే వారం పార్టీ కార్పొరేటర్లతో మీటింగ్ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర బీసీల్లో అవగాహన పెరిగిందని, ఉద్యమం బలంగా ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అన్నీ తెలిసే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.

డిక్లరేషన్ అమలు తర్వాతే ఎన్నికలు జరపాలి

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని తలసాని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్టీ పరంగా బీసీ సంఘాలు, కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే తప్పుల తడకగా ఉన్నదని, రాష్ట్రంలో బీసీలు 57-58 శాతం ఉంటారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం జరిపిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 51 శాతం మంది ఉన్నట్టు తేలిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో బీసీల జనాభా ఎలా తగ్గిందని నిలదీశారు. ఏడాదికి సగటున 1.3 శాతం జనాభా పెరుగుదల ఉంటుందని, రాష్ట్రంలో 60 లక్షల మందికి లెక్కలు లేవని, బీసీ ముస్లింల జనాభా పెరగలేదు కానీ, ఓసీ ముస్లింల జనాభా పెరిగిందంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం రీసర్వే చేయాలని, కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలంతా సర్వేలో పాల్గొంటామని తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ పరంగా రిజర్వేషన్ ఇస్తే బీసీలు ఒప్పుకోరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనాభాను తక్కువ చూపిస్తే నిధులు తక్కువ వస్తాయని, పునర్విభజన జరిగితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు తెలంగాణకు తగ్గుతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

కుంభమేళా బాధితులను పరామర్శిస్తున్న సిరికొండ మధుసూదనాచారి

కుంభమేళా రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

బాధిత కుటుంబాలను పరామర్శించిన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

రామంతాపూర్,ఫిబ్రవరి 12: కుంభమేళాకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శశికాంత్ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అలాగే మృతుల కుటుంబాలను రూ. 10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడంతోపాటు, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మల్లాపూర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలు ఆయా నివాసప్రాంతాలకు బుధవారం చేరుకున్నాయి. దీంతో నాచారం ప్రాంతాల్లోని మల్లాపూర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముత్యంరెడ్డి, మారయ్య, ఆశు, జావీద్, రెహమాన్, షాబుద్దీన్, మస్తాన్, సాజీద్, సుక్కల స్వామి, సాబీర్ పాల్గొన్నారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఉపేంద్ర, పల్లె రవి

మద్యం మాఫియా గుప్పిట్లో తెలుగు రాష్ట్రాలు

- నాడు నామమాత్రంగా పెంచితేనే గగ్గోలు
- నేడు బీరుపై ఏకంగా రూ.30-40 పెంపు
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను ప్రస్తుతం మద్యం మాఫియా నడిపిస్తున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్‌గౌడ్, ఉపేంద్రతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. డిస్టిలరీ సంస్థల ఒత్తిళ్లకు తలొగ్గబోమని ప్రకటించి, ఇప్పుడు బీర్ల రేట్లు పెంచడం ఏమిటని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో నామమాత్రంగా ధరలు పెంచితే గగ్గోలు పెట్టి ఇప్పుడు బీరుకు ఏకంగా రూ.30 నుంచి రూ.40 పెంచారని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో బ్రాందీ, విస్కీ రేట్లను సైతం భారీగా పెంచుతారని ఆందోళన వ్యక్తంచేశారు. నాణ్యతలేని బీర్లను సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలతో పాలకులు చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఒక్కటై ఈ బీర్ల ధరలు పెంచాయా? అన్న అనుమానం కలుగుతున్నదని, రెండుచోట్ల ఒకేసారి ధరలు పెంచడంతో రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం ఉండొచ్చని విమర్శించారు. బెల్ట్‌షాపులను బంద్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముంగిట ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. హోంగార్డులకు వేతనాలు పెంచి నాడు కేసీఆర్ వారి గౌరవం పెంచారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు హోంగార్డులకు జీతాలే ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హోంగార్డులు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. హోంగార్డుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా త్వరలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేపడతామని శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు.

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను ప్రారంభించి, బ్యాటింగ్ చేస్తున్న బండా ప్రకాశ్, చిత్రంలో దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు

దేశంలోనే గొప్ప నాయకుడు కేసీఆర్

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 12: కేసీఆర్ దేశంలోనే గొప్ప నాయకుడని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ పేర్కొన్నారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో కేసీఆర్ క్రికెట్ కప్-2025 టోర్నీని బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని, వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చారన్నారు. కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.



పాలకుర్తి మండలంలో బీఆర్ఎస్‌లో చేరినవారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎర్రబెల్లి

బ్రోకర్ మాటలతో రేవంత్‌రెడ్డికి అధికారం

- ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం
- మళ్లీ ఎన్నికలు వస్తే కేసీఆరే సీఎం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్

పెద్దవంగర, ఫిబ్రవరి 12: బ్రోకర్ మాటలతో రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టారని, 15 నెలల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, ఆరు నెలల్లో రేవంత్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోస్యం చెప్పారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పేర్ల మార్పుతోనే ఎంతో అభివృద్ధి చేశామని కాంగ్రెస్ గొప్పలు చెబుతున్నదని ఎద్దేవా చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తే కేసీఆరే సీఎం కావడంతో పాటు 100 సీట్లు రావడం ఖాయమని చెప్పారు. సమన్వయం లేకనే ఇప్పటికీ మంత్రి వర్గ విస్తరణ జరగలేదని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పిచ్చుక లాంటోడని.. పంట ఎక్కడ పచ్చగుంటే.. అక్కడే ఉండే రకమని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలు తేదీలను మార్చడమే తప్ప, హామీల విషయంలో కాంగ్రెస్ ఏమీ చేయలేదని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో 30 మంది చేరిక

పాలకుర్తి, ఫిబ్రవరి 12: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం 30 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. శాతాపురం శివారు